జిల్లా స్థాయిలో ఉత్తమ విద్యార్థులకు అవార్డులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 9న వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో షైనింగ్ స్టార్స్ అవార్డులు అందించనున్నారు. మండలానికి ఆరుగురు విద్యార్థుల చొప్పున ఒక్కొక్కరికీ రూ.20 వేల నగదు పురస్కారం, పతకం, సర్టిఫికెట్లు కలెక్టర్ ద్వారా అందజేస్తారని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఆరోజు ఉదయం 08 గంటలకు వెంకటేశ్వర ఆనం కళాకేంద్రానికి హాజరవ్వాలని సూచించారు. జిల్లాలోని ఎంఇఒలు, సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు వారి పరిధిలోని సబంధిత విద్యార్థులు హాజరయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రారెత్తిస్తున్న ఎండలు

- నిప్పులు కక్కుతున్న భానుడు
- వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి
- వేళాపాలా లేకుండా కరెంటు కోతలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, కొవ్వూరు

ఎండలు మండిపోతున్నాయి. గడిచిన ఐదు రోజుల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుం డడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు చెందుతున్నారు. గత గురువారం కొవ్వూరులో 32 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయితే శుక్ర వారం 38 డిగ్రీలకు చేరుకుంది. రానున్న ఒకటి రెండు రోజుల్లో 40 డిగ్రీల మార్కును చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని ఇప్పటికే విపత్తుల నివారణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మే 28 నుంచి జూన్ 14వ తేదీ వరకు రోహిణి కార్తె కొనసాగుతుంది.

ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. దీంతో మండువేసవిలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎండల బాధ తప్పిందని అంతా భావించిన తరుణంలో మళ్లీ ఎండలు ప్రతాపం చూపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణం చల్లబడిందని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అయ్యారు. ఇప్పటికే దేవరపల్లి, గోపాలపురం, చాగల్లు, కొవ్వూరు, తాళ్లపూడి పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో వరి నారిమళ్లు ముమ్మరంగా పోస్తున్నారు. మిగతా మండలాల్లోనూ నారుమాళ్లు పోసేందుకు సన్నద్ధం అయ్యారు. ఈ తరుణంలో ఎండల తీవ్రత పెరగడంతో నారుమళ్లు పోయడం రైతులు తాత్కాలికంగా వాయిదా వేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం 10 గంటల నుంచి ప్రతాపం చూపిస్తున్నాయి. ఎండలకు తోడు ఉక్కపోత అధికం అవడం, కరెంటు కోతలు పెరగడంతో జనం వేసవి తాపంతో అవస్థలు పడుతున్నారు. ఎండల తీవ్రత ఇదే రకంగా ఉంటే జూన్ 12న పాఠశాలలు తెరవడంపై ప్రభావం పడే అవకాశం ఉంది.

అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం సాగించే ప్రయాణికులు, వాహనదారులు వేడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు దారి మధ్యలో చెట్ల నీడల్లో సేద తీరుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న రాజమహేంద్రవరంలోని దేవీచౌక్

పల్లెల్లో వేళాపాళా లేకుండా కోతలు

ఉదయం 9 గంటలు దాటిందంటే సూర్యుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు జంకే పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇళ్లలో ఫ్యాన్ లేదా కూలర్ కింద కూర్చొని కాస్త సేద తీరుదామంటే కరెంట్ ఉండటం లేదు. విద్యుత్ శాఖ అధికారులు అప్రకటిత కోతలతో జనం అల్లాడిపోతున్నారు. వేళాపాళలేని కోతలతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కోతలు పెడుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వేడి, ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నా వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏదైనా సందర్భంలో కరెంటు సమాచారం తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ కార్యాలయాలకు ఫోన్ చేస్తే..ఫోన్లు ఎత్తి సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారన్న వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. మెయింటనెన్స్ డే పేరుతో వారానికొకసారి ఐదారు గంటలు కోత విధిస్తూనే అనధికారికంగా కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో ఎండల తీవ్రతకు వెలవెలబోతున్న మెయిన్ రోడ్డు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తాలు తీసుకోవాలి

- ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారి నుంచి రక్షణ పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు.
- సాధ్యమైనంత వరకు ఎండలో తిరగరాదు. తప్పనిసరి పరిస్థితుల్లో తలకు టోపి, లేదా టవల్ కట్టుకోవాలి, గొడుగు వేసుకుని వెళ్లడం మంచిది.మంచినీళ్లు అందుబాటులో ఉండాలి.
- నలుపు, ముదురు రంగు దుస్తులు కాకుండా తెలుపు లేదా లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి.
- రోడ్ల మీద విక్రయించే పానీయాలు, కూల్‌డ్రింక్స్ తాగరాదు.
- మాంసాహారం, మసాలాతో తయారుచేసిన ఆహారం తినరాదు. ఆకు కూరలు, కూరగాయలతో తయారు చేసిన ఆహారం మేలు.
- పరిశుభ్రమైన నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఇంటిలో తయారుచేసే పండ్ల జ్యూసులు తీసుకోవాలి.
- మద్యం తాగడం, పొగ తాగడం వంటివి చేయరాదు. మద్యం తాగి ఎండలో ప్రయాణించడం మంచిదికాదు.
- వృద్ధులు, గర్భిణీలు, చినపిల్లలు ఇంటిలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలోకి వెళ్లనీయరాదు.
- వేసవి సెలవులు కాబట్టి పిల్లలు బయటకు వెళ్లే ఆడుకోవడానికి ప్రయత్నం చేస్తారు. వారికి ఇంటిలోనే ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు చేసుకుంటే మంచిది.
- వృద్ధులు, చినపిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జెసి చిన్నరాముడు

2025-26 వార్షిక క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక కలక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం బ్యాంకర్లతో వార్షిక ప్రణాళికపై జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, జిల్లా సంప్రదింపుల సంఘం (కన్సల్టేటివ్ కమిటీ), జిల్లా స్థాయి సమీక్షా సంఘం (రివ్యూ కమిటీ) సమావేశంలో వార్షిక రుణ ప్రణాళికను అనుసరించి గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో వివిధ పథకాలలో, బ్యాంకు సంబంధిత కార్యకలాపాలలో సాధించిన పురోగతి గురించి సమీక్ష నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించి లక్ష్యానికి మించి 120 శాతం మేర కేటాయింపులు జరిపినట్టు తెలిపారు. ప్రాధాన్యత రంగాలకు కూడా లక్ష్యాన్ని మించి 113 శాతం మేర కేటాయింపులు చేశారని, 2023 - 24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో అధిక ప్రగతి సాధించామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 1,36,618 మంది రైతులకు రూ.820 కోట్ల మేర రుణాలు అందించాలన్నది లక్ష్యమని జెసి పేర్కొన్నారు. ముద్ర రుణాల కింద రూ.863 కోట్లను, పశుసంవర్ధక రంగానికి రూ.269 కోట్లను రుణంగా అందించనున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేకూర్పు సాధించడంలో రియల్ టైమ్ విధానంలో వారు జీవనోపాధి కల్పన కోసం ఉపయుక్తంగా ఉండే రంగాలలో ఆర్థిక చేకూర్పు సాధించడం కోసం సర్వే నిర్వహించి, ఆ మేరకు బ్యాంకర్లకు ప్రతిపాదనలు పంపుతున్నట్టు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ (యూనియన్ బ్యాంక్) ఎ.మనోజ్, నాబార్డ్ డిడిఎం చక్రధర్ రావూరి, ఎల్‌డిఎం ఎండివి.ప్రసాద్, ఇతర జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పబ్లిక్ హెల్త్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్లు తమ వార్డు పరిధిలో విస్తతంగా పర్యటించి.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించి మున్సిపల్, పోలీసు అధికారులతో కూడిన 5 శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ బృందాలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో కలిసి పలు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు నిర్వహించి నట్టు తెలిపారు. పిడింగొయ్యి ప్రాంతంలోని శ్రీవెంకటేశ్వర హోల్‌సేల్ మార్కెట్‌లో దాడులు నిర్వహించగా.. సుమారు 2 టన్నుల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ బందాలు ఇప్పటివరకు 3,689 సందర్భాలలో దాడులు నిర్వహించి.. దాదాపు 7.50 టన్నుల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రూ.12 లక్షల జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు.

డ్రోన్ కెమెరాను పరీక్షిస్తున్న సిఐ విశ్వం

అసాంఘిక శక్తులపై డేగ కన్ను

ప్రజాశక్తి -కొవ్వూరు

అత్యధునికి పరిజ్ఞానంతో పనిచేసే డ్రోన్ కెమెరాల సాయంతో అసాంఘిక శక్తుల భరతం పడతామని పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. ఎపి ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు రూ.3 లక్షల విలువైన డ్రోన్ కెమెరాలను శుక్రవారం పట్టణ సిఐకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డ్రోన్ కెమెరాల సాయంతో నాలుగు కిలోమీటర్ల రేడియేషన్‌లో ఉన్న విషయాలను సైతం స్పష్టంగా గుర్తించ వచ్చునన్నారు. ఈ కెమెరా ఎక్కడ నుంచి ఎగరవేసినా బ్యాటరీ ఛార్జింగ్ అయిపోతే మళ్లీ అదే ప్రదేశానికి వచ్చి ఆగుతుందన్నారు. ఫోర్ కె రిజల్యూషన్‌తో స్పష్టమైన ఫోటోలను తీస్తుందన్నారు. ఏదైనా అల్లర్లు చోటు చేసుకున్న సమయంలో, ఉత్సవాలు ఇతర ధర్నాల సందర్భాల్లో ఆ ప్రదేశానికి వెళ్లకుండానే డ్రోన్ కెమెరాలో చిత్రీకరణ ద్వారా నిందితులను గుర్తించే ఆస్కారం ఏర్పడు తుందన్నారు. అపూస్మా అధ్యక్షుడు వివి అనీష్, స్టేట్ ఇసి మెంబర్, కార్యదర్శి పాలెంపాటి వెంకటరత్నం, ముద్రగడ రవిచంద్ర, నిన్న సత్యనారాయణ, దీప్తి స్కూల్ కరస్పాండెంట్ లూద్ శౌరి, ఎన్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనం కోసం అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి- కొవ్వూరు

ప్రజలకు అందించే పౌర సేవలు విషయంలో జవాబుదారీతనంపై ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తోందని ఆర్‌డిఒ రాణి సుస్మిత స్పష్టం చేశారు. కొవ్వూరు పట్టణంలో అన్న క్యాంటీన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రాణి సుస్మిత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భూములకు భద్రత, 65 ఏళ్ల నిండిన సీనియర్ సిటిజన్స్‌కు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ, అన్న క్యాంటీన్‌లకు ప్రాముఖ్యత ఇస్తున్నట్టు తెలిపారు. అన్న క్యాంటీన్‌లలో అందచేసే ఆహార పదార్థాల నాణ్యత, సమయపాలన, తదితర అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు నమోదవుతున్నట్లు తెలిపారు. ఇదే విషయంపై అన్న క్యాంటీన్ ద్వారా అందుతున్న ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాల గురించి ప్రజలతో మేమైకం అవ్వడం కోసం ఆకస్మిక తనిఖీ చేసి, ఐవిఆర్ఎస్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించినట్లు రాణి సుస్మిత తెలిపారు. ఆర్‌డిఒ వెంట మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు.

అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్న వారిని ఆరా తీస్తున్న ఆర్‌డిఒ

జీవితంలో చదువు ఒక వ్యాపకం అవ్వాలి

ప్రజాశక్తి-కడియం

జీవితంలో అందరికీ చదువు ఒక వ్యాపకం అవ్వాలని కడియం గ్రామ సర్పంచ్ మోసిగంటి సత్యవతి సూచించారు. కడియం శాఖ గ్రంథాలయంలో బాలల వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎస్.శ్రీదేవి నిర్మల మాట్లాడుతూ 40 రోజుల పాటు దాదాపు 100 మంది విద్యార్థులకు కథలు, గేయాలు, విజ్ఞాన విశేషాలు, నీతి పాఠాలు, సాంప్రదాయ క్రీడల గురించి బోధించారన్నారు. బాలలు కేవలం సైన్స్ వినియోగించడమే కాక సాంకేతిక దృక్పథాన్ని కూడా అలవర్చుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అడపా సుబ్రహ్మణ్యం విద్యార్థులందరికీ వాటర్ బాటిల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు, ప్రముఖ దాత ఉప్పులూరి హనుమంతరావు, యుటిఎఫ్ నాయకులు ఆకుల వీర్రాజు, ఉంగరాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

9న మదర్ ఆసుపత్రిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ నెల 9న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. జెఎన్.రోడ్‌లో ఉన్న హాస్పిటల్ ప్రాంగణంలోని క్యాంపులో డాక్టర్ వి.మేఘన ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. సుగర్ వ్యాధి, ఊబకాయం, సంబంధిత ఆరోగ్య సమస్యలపై వైద్య చికిత్స అందిస్తారు. క్యాంపులో అందించే ప్రధాన సేవల్లో ఉచిత బాడీ ఫ్యాట్ చెకప్ కూడా ఉంది. దీంతో పాటు, ప్రజలకు వెల్‌నెస్ కోచ్ ద్వారా ఉచిత కౌన్సిలింగ్ అందిస్తారు. మంతెన గార్డెన్స్, అపోలో ఫార్మసీ వెనుక, జె.ఎన్. రోడ్, 86-6-1 చిరునామాలో గల మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించే వైద్య శిబిరం సమాచారం కోసం 9951612718, 9493337331 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సబ్సిడీతో పశువులకు దాణా పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపురం

పశువుల పాల దిగుబడి పెరుగుదలకు కామధేను సేంద్రియ కృత దాణా ఎంతగానో ఉపయోగపడుతుందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ జెడి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామంలో పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఇ.చెన్నకేశవులు ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ బిఎస్ఎస్ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం.ధరిన్‌బాబు, జి.సోమేశ్వరావు పాల్గొన్నారు.

శ్రీఆదిత్య విద్యార్థులకు అవార్డుల పంట

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియం గ్రామంలోని శ్రీఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎపి ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులు లభించినట్టు ఆ స్కూల్ ప్రిన్సిపల్ భైరిశెట్టి రామకృష్ణ తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఈ అవార్డుకు ఎంపికైనట్టు విద్యాశాఖ అధికారులు ద్వారా తమకు తెలిసిందన్నారు. శ్రీఆదిత్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పి.ప్రణీతసాయిశ్రీ (591), ఎల్.లేఖన (590), ఎన్.సింధు భవాని (588), ఎవిఎస్‌కె.లాస్య శ్రీనిధి (586), మురమండ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పోలోతు భవ్య శ్రీదేవి (591), దుళ్ల అమరావతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన కర్రి తేజ (586) ఈ అవార్డులకు ఎంపికయ్యారు.

శ్రీవల్లికి కెవిపిఎస్ నాయకుల అభినందన

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు చర్చ్ పేటకు చెందిన పిట్టా శ్రీవల్లి పారా మెడికల్ కోర్సు పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సందర్భంగా జైభీమ్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు శ్రీవల్లిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యత్‌లో శ్రీవల్లి ఉన్నత చదువుల కోసం వెళ్లేందుకు జైభీమ్ ట్రస్ట్ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజు, బాబ్జి, సుధాకర్, నాగ రాజు ఉన్నారు.

ప్రశాంతంగా డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

డిఎస్‌సి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం ఉదయం సెషన్ 9.30 గంటల నుంచి 12.00 గంటల వరకూ, మధ్యాహ్నం సెషన్ 2.30 గంటల నుంచి 5.00 గంటల వరకూ పరీక్షలలో ఉదయం సెషన్‌కు 600 మందికి 532 మంది, మధ్యాహ్నం సెషన్, 600 మందికి 527 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసిన ఐయాన్ డిజిటల్ జోన్ లూథర్‌గిరి రాజీవ్ గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, లూథర్‌గిరిలో పరీక్షల నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వంతో నైపుణ్యత

ప్రజాశక్తి-తాళ్లపూడి

విద్యార్థుల్లో నైపుణ్యం పోటీ తత్వం పెంపొందించేందుకు స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న చదవడం నాకు ఇష్టం అనే కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని పలువురు వక్తలు అన్నారు. తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో సెలవల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన పశు వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, తాళ్లపూడిలోని శ్రీవిజేత హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ జెవి.ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యత వాటి అవసరం విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ సందర్శనతో ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ వ్యక్తులుగా ఎదగాలని సూచించారు. గ్రంథ పాలకుడు నరేష్ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు ఏ విధమైన అంశాల పట్ల అవగాహన కల్పించాలో వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలోని విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాఠకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బక్రీద్ పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్‌పి నరసింహ కిషోర్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ముస్లిము సోదరులు వారి కుటుంబాలతో బక్రీద్ పండుగ జరుపుకోవాలని ఆకాక్షించారు. మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో హైకోర్టు ఆదేశాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఎంఎల్ఎ గోరంట్లను కలిసిన తమ్మా రవి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పశుసంవర్ధక శాఖ సంక్షేమ బోర్డు సభ్యుడు తమ్మా రవి రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బుచ్చయ్యచౌదరి ఆయనను అభినందించి ఆశీర్వదించారు. ఆయన వెంట టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, ఎఎంసి ఛైర్మన్ మార్ని వాసుదేవ్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరావు, ఎడి జి.రవివర్మ ఉన్నారు.

శ్రీగౌతమి విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

ప్రజాశక్తి-గోపాలపురం

ఇంటర్మీడియట్ 2025 పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీగౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్టు కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కెఎస్‌డి ఆశీర్వాదం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు అందించే ప్రతిభ అవార్డులకు తమ కళాశాల నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపిక అవడంపై హర్షం వ్యక్తంచేశారు. ప్రత్తిపాటి సత్య వసంత ఎంపిహెచ్‌డబ్ల్యు విభాగంలో 957 మార్కులు, పోతుల కృష్ణశ్రీదుర్గ సిఇసి విభాగంలో 952 మార్కులు సాధించినట్టు తెలిపారు. అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పేదలకు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన అదనపు ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తున్నట్టు తహాశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాలంగి పంచాయతీ ఆవరణలో నిర్వహించిన హౌసింగ్ డేలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఉదయ్ కుమార్, ఫణి కుమార్, మండల ప్రత్యేకాధికారి ఎం.సందీప్, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఇఒపిఆర్‌డి ఆంజనేయ శర్మ, హౌసింగ్ ఎఇ ఏడుకొండలు పాల్గొన్నారు.

'అస్సాగో'లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి-గోకవరం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టండి అనే అంశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, నిర్వహణ బందం, స్థానిక పర్యావరణ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర రావు, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వివేక్ కుమార్ శుక్లా మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలని, పరిశ్రమలు పచ్చదనాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఇంట్లో ఉన్న వ్యర్థాలను ఉపయోగించి ఉపయోగకరమైన వస్తువులను తయారు చేయడం, ప్లాస్టిక్ ప్యాకేజింగ్ లేకుండా ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ ప్రకతితో సంబంధం ఉన్న అనుభవాలను డైరీలో రాయడం, సమీప భూమిని సంరక్షించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు. జిమ్ హెచ్ఆర్ చంద్రశేఖర్, డిజిఎం సాలేష్ చంద్రశేఖర్, ఎజిఎం తారక రామ్, హెచ్ఆర్ అవిన్, ఎఎస్ఒ భవాని శంకర్, హెచ్ఎస్ఇ మేనేజర్ సూర్య స్వామి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానసిక వికాసానికి, వ్యక్తి అభివృద్ధికి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహద పడతాయని మోర్త ఉన్నత పాఠశాల సంస్కృత, తెలుగు ఉపాధ్యాయులు చెరుకూరి వెంకటకష్ణ ప్రసాద్ అన్నారు. 34 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారం ముగిసినట్టు గ్రంథాలయ అధికారి గుత్తికొండ కృష్ణారావు ప్రకటించారు. ఈ సందర్భంగా చెరుకూరి మాట్లాడుతూ విద్యార్థుల గురించి వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించడం ముదావహమని, విద్యార్థుల్లో ఉన్న జ్ఞానాన్ని పెంచడానికి, వారిలో ఏకాగ్రత పెరగడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు.విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

కార్టూ'నిజం'

అమెరికా వృద్ధికి ట్రంప్ దెబ్బ

నేరాలు ఘోరాలు

కారు చెట్టును ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో ఒక యువకుడు, అతడి మూడేళ్ల మేనకోడలు మృతి చెందిన సంఘటన మండలంలోని పోతవరం వద్ద శుక్రవారం చోటు చేసుకంది. గ్రామానికి చెందిన నూతుకుర్తి మల్లేష్ (25) శుక్రవారం తల్లి రత్నకుమారి, సోదరి అంకిత, మేనకోడలు ఆద్య (3)తో కలిసి కారులో నిడదవోలు బయల్దేరారు. పోతవరం దాటిన తరువాత కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న మామిడి చెట్టును బలంగా ఢీకొందవి. ఈ సంఘటనలో మల్లేష్, ఆద్య అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి రత్నకుమారికి శరీరం నుండి కాలు వేరయ్యింది. చెల్లి అంకితకు పక్కట ముకలు విరిగి తలకు బలమైన గాయం అయ్యింది. వీరిని వెంటనే ఏలూరు ఆశ్రమం ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి కూడా ప్రమాదకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిడిగట్లలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - కోరుకొండ

సెల్ ఫోన్ విషయంలో వచ్చిన చిన్నపాటి వివాదంలో ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన కోరుకొండ మండలం నిడిగట్లలో చోటు చేసుకుంది. కోరుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటనగరానికి చెందిన కొవ్వాడి చిన్న అబ్బులు (30)కు తన స్నేహితుల మధ్య ఈ నెల 4వ తేదీన వచ్చిన చిన్నపాటి వివాదంలో చిన్న అబ్బులను మెడ కోసి, రాయితో కొట్టి చంపినట్లు తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని కోరుకొండ సిఐ సత్యకిషోర్ పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తాపీ కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు పోతాబత్తుల వీరవెంకటసత్యనారాయణ(39) పులిమేరు గ్రామ రహదారిపై గురువారం అర్ధరాత్రి గాయాలతో మరణించాడని పోలీసులు తెలిపారు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం సైకిల్‌పై బయటికి వెళ్లి తిరిగి తన గ్రామం వస్తుండగా మార్గమధ్యలో పులిమేరు వద్ద రోడ్డుపై పడిపోయి ఉన్నాడని ముక్కు నుంచి రక్తస్రావం అవుతుండగా అతనిని చుట్టుపక్కల వారు పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని తెలిపారు. మృతునికి తల్లి, భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

కొబ్బరి చెట్ల తొలగింపు కేసులో నిందితుడికి జరిమానా, జైలుశిక్ష

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి ఊబలంక కెనాల్ పక్కన ఉన్న కొబ్బరి చెట్లను అనుమతులు లేకుండా కొట్టించిన కేసులో పడాల రంగారెడ్డికి కోర్టు శిక్ష విధించింది. వివరాలు ప్రకారం 2017 డిసెంబర్ 3న చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన రంగారెడ్డి తన అనుచరులతో కలిసి, ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొబ్బరి చెట్లను నరికించాడని ఫిర్యాదు అందింది.ఈ విషయాన్ని ఆత్రేయపురం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కర్రా రాజమౌళి పరిశీలించడానికి వెళ్లగా, రంగారెడ్డి ఆయనపై దౌర్జన్యం చేసినట్టు సమాచారం. ఈ సంఘటనపై రాజమౌళి పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి రావులపాలెం ఎస్ఐ విద్యాసాగర్ రంగారెడ్డిపై కేసు నమోదు చేశారు. 2025 జూన్ 6న కొత్తపేట ఎజెఎఫ్‌సిఎం కోర్టులో వాదోపవాదనలు ముగిశాయి. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి రంగారెడ్డికి పది నెలల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి ఎన్.ఆనందరావు వాదనలు వినిపించగా, సాక్ష్యాల సేకరణలో సిఐ శేఖర్ బాబు కీలక పాత్ర పోషించారు.

పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీ స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు గామన్ ఇండియా వంతెన వద్ద పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి నుంచి హైదరాబాద్ తరలిస్తున్న లారీలో 38 పశువులు ఉన్నట్టు సిఐ పి.విశ్వం తెలిపారు. తెలంగాణలోని నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన తాండ్ర నరేష్, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లక్ష్మీపాలెంకు చెందిన పసరుల దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న ఆవులను గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉపాధి కూలీలు వంద రోజులు పని పూర్తి చేసుకుని వారి జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం శ్రీరాంపురం గ్రామంలో సామాజిక తనిఖీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థాయిలో ఉపాధి వేతనదారులకు ఉపాధి హామీ చట్టం హక్కులు, సౌకర్యాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు 100 రోజులు పూర్తి చేసుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. సామాజిక, వనరుల పటం ద్వారా ఏ ఏ పనులు నిర్వహించారు, మిగిలిన ఏఏ పనులు ఉన్నాయి అనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డైరెక్టర్ జి.శ్రీకాంత్, స్టేట్ రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

బస్ కాంప్లెక్స్‌కు ఫ్యాన్ల వితరణ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌లో విద్యుత్‌ను ఆదా చేసే బిఎల్‌డిసి ఫ్యాన్లను దాతలు శుక్రవారం తుని డిపో మేనేజర్ ఎం.కిరణ్‌కుమార్‌కు దాతలు అందించారు. ఈ ఫ్యాన్‌ను రిమోట్ కంట్రోల్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఈ సందర్భంగా సంబంధిత దాతలను అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ టిఎస్.రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రజల సమస్యల్ని తెలుసుకుని సత్వరం పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి వారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టిడిపి క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు 80 వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలు కొనియాడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కారం అవుతున్నాయని అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటోందని, రాబోయే కాలంలో మరింత సుపరిపాలన అందిస్తామని అన్నారు. ప్రజల వినతులను పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు అందజేయడంతో పాటు ఆన్ లైన్ లో కూడా నమోదు చేస్తామని ఎంఎల్ఎ సత్యానందరావు వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, జక్కంపూడి వెంకటస్వామి, కేతా శ్రీనివాస్, పడాల బులి కొండారెడ్డి, పెచ్చెట్టి చిన్నారావు, చిన్న కేవీ తదితరులు పాల్గొన్నారు.

మడికి విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి

ఆలమూరు: మండలంలోని మడికి, మడికి శివారు చిలకల పాడు గ్రామాలలో లోవోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామ టిడిపి యువ నేత పెనుమాక నరేష్ ఆధ్వర్యంలో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావుకు రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ లో శుక్రవారం వినతి అందజేశారు. స్థానిక విలేకరులతో నరేష్ మాట్లాడుతూ సమస్యను ఎంఎల్ఎ బండారు దృష్టికి తీసుకుని వెళ్లి వివరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు తెలిపామన్నారు. ఎంఎల్ఎ బండారు వెంటనే స్పందించి ఎడిఇకి ఫోన్ చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. ఈ సందర్భంగా నరేష్ ఆనందం వ్యక్తం చేస్తూ ఎంఎల్ఎ బండారు సత్యా నందరావుకి గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. నరేష్ వెంట పలువురు యువ నేతలు ఉన్నారు.

రావులపాలెం ప్రజాదర్బార్ లో వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ బండారు

బాల బాలాజీ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

బాల బాలాజీ స్వామి దివ్య తిరు కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి దివ్య తిరుకళ్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు పండితులు, అర్చకులు, పురోహితులు బందం రెండు వర్గాలుగా ఏర్పడి కళ్యాణమూర్తులను కీర్తి ప్రతిష్టలు, గుణగణాలను, వంశాల విశిష్టతను, సలోక్తుల నడుమ కీర్తిస్తూ సరదాగా స్వామివారికి నిర్వహించిన రాయబారోత్సవం యాత్రికులను ఆకట్టు కుంది. రెండు బృందాలు పరస్పరం తాంబూలాలు మార్చుకుని కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాలో వాడపల్లి వెంకటేశ్వర స్వామి, అమలాపురం వెంకటేశ్వర స్వామి ఆయా ఆలయాలనుంచి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎంఎల్ఎ డ్డి సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎంపిపి కుసుమ వనజ కుమారి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు, కళ్యాణ మహోత్సవాలు తిలకించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగం గా రెండవ రోజు శుక్రవారం గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. ఆలయ ముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాసా చార్యులు, చిన్న జీయర్ స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు జరిగాయి ధ్వజారోహణ సందర్భంగా సంతానలేమితో ఇబ్బందులు పడుతున్న మహిళలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవంలో సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణ రాజు, ఉత్సవ మండలి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అమెరికా మద్దతు

ప్రజాశక్తి - అమలాపురం

ఉగ్రవాదంపై పోరులో అమెరికా సంయుక్త రాష్ట్రాల మద్దతు భారతదేశానికి ఉందని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ బాలయోగి తెలిపారు. అఖిల పక్ష బృందం ఉగ్రవాదం పై పోరులో దేశ వాణిని వినిపించేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేమ్స్ డేవిడ్ వాన్స్ తో భేటీలో ఈ విషయాన్ని ప్రకటించినట్లు చెప్పారు. ఆపరేషన్ సింధూర్ ను గూర్చి పూర్తిగా వివరించామన్నారు.

రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా.. నూతన పార్కింగ్ ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 84 స్థలాలను గుర్తించినట్లు వెల్లడించారు. వీటిల్లో కొన్ని ప్రభుత్వ స్థలాలు కాగా మిగతావి ప్రైవేట్ స్థలాలలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలు, జంక్షన్ల వద్ద వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యను చాలా వరకు తగ్గించే అవకాశం ఏర్పడుతుందన్నారు.

రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-గోపాలపురం

సిమెంట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పంచాయతీరాజ్ డిఇఇ ఎం.వెంకటలక్ష్మి, ఎఇ జి.పవన్ కుమార్ సూచించారు. గోపాలపురంలోని ఉప్పరగూడెంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. అనంతరం డిఇఇ ఎం.వెంకటలక్ష్మి, ఎఇ పవన్ కుమార్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్ జానీ పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాడిపర్రులో నూతనంగా నిర్మించిన సోమేశ్వరాలయంలో నిడదవోలు మాజీ ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు శుక్రవారం పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు. పెండ్యాల గోవిందరావు, సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, మట్టా చంటి, నందిన వీర్రాఘవులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలో జనసేన పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రతిక్షణం ప్రజాసేవకు పాటు పడుతోందని, ప్రజలు కార్యకర్తలు అనుక్షణం తమ సమస్యలు కార్యాలయం వద్ద వినతులు అందజేసి పరిష్కారం పొందాలని ఆయన సూచించారు. ఈ ప్రారంభం కార్యక్రమంలో చోడసాని బాపిరాజు, ఆవుపాడు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు డ్వాక్రా రుణాలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

అసంపూర్తి నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను పూర్తి చేయించేందుకు అవసరమైతే డ్వాక్రా రుణాలు అందజేసేలా అధికారులు ఒక సమావేశంలో చర్చించారు. తాళ్లపూడి మండల కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి అమ్మాజీ అధ్యక్షతన గురువారం గృహ నిర్మాణాల లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎపిఎం మంగాయమ్మ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడం కోసం లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. తాళ్లపూడి మండలంలో 218 మంది లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రమణ, గృహ నిర్మాణ శాఖ ఎఇ శ్రీనివాస్, పలువురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డ్వాక్రా యానిమేటర్స్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

గత ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకూ నల్లజర్ల గ్రంథాలయ శాఖలో నిరంతరాయంగా జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రంథాలయ చైర్మన్ గుదే సుశీల పాల్గొన్నారు. వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఎస్‌కె.ఖన్ బాజీ, గ్రంథాలయాధికారి ఎవి.రమణ పాల్గొన్నారు.

గోకవరం ఆర్‌టిసి డిపోలో యోగా డే

ప్రజాశక్తి-గోకవరం

కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు గోకవరం ఆర్‌టిసి డిపో మేనేజర్ సుచరిత మార్గరెట్ ఆధ్వర్యంలో యోగా టీచర్ రమ్య పర్యవేక్షణలో డిపో సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగా వల్ల ఉపయోగాలు, యోగా చేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ రమ్య టీచర్ స్వయంగా ఆసనాలు వేస్తూ సిబ్బంది తో యోగా డే కార్యక్రమం నిర్వహించారు.

అన్నకాంటీన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కె.మాధవి

అన్న క్యాంటీన్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పేదల కడుపునింపేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లను సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం ఆర్‌డిఒ కె.మాధవి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బల్లగేటు సెంటర్ లోని అన్న క్యాంటీన్ ను శుక్రవారం ఆర్‌డిఒ మాధవి నెల వారి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు సక్రమంగా ఉన్నాయా లేవా !అని ఆమె స్వయంగా పరిశీలించారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. అనంతరం టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా ప్రాంతాలను పరిశీలించారు. క్యాంటీన్ కు వచ్చే వారికి స్వచ్ఛమైన తాగునీటి ఏర్పాట్లు ఉన్నాయా, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా, ప్లేట్లు పరిశుభ్రతలను నిశితంగా పరిశీలించారు. సిబ్బంది నిబద్ధత, సేవా దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. క్యాంటీన్ నిర్వహణకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లకు బాధ్యతలు అప్పగించామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్న క్యాంటీన్ లలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ అందిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు తో పాటు చేతులు శుభ్రం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కేవలం రూ.5లకే కడుపునిండా భోజనం పెట్టేందుకు ప్రభుత్వం మళ్లీ అన్న క్యాంటీన్లను పునరుద్ధరించిందని తెలిపారు. అనంతరం భోజనాన్ని రుచి చూసి నాణ్యత పరిశీలించారు. పదార్థాల తయారీకి వినియోగించే సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం చేసేందుకు వచ్చిన కూలీలు, ఆటో రిక్షా నడిపేవారు, వివిధ ప్రాంతాల నుండి వివిధ పనులపై వచ్చిన వారితో ఆర్‌డిఒ భోజనం ఎలా ఉందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఇన్‌ఛార్జ్ కమిషనర్ పివి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం తయారీ పై శిక్షణ ఇస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్

పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో వండి అందించాలని సమగ్ర శిక్షా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సురేష్ సూచించారు. గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం ఆదేశాలు మేరకు మండల విద్యాశాఖ అధికారి సత్తి సత్య కృష్ణ అధ్యక్షతన మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు వంట తయారు చేసే విధానంపై అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్ ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మెనూ ప్రకారం వంట చేసేటప్పుడే కాకుండా వంట చేసే ప్రదేశాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే విషయంలో శ్రద్ధ వహించాలన్నారు.ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేస్తారన్నారు. విద్యార్థులు భోజనం చేసేందుకు ఇష్టపడేటట్టు ఆహారాన్ని తయారు చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమం సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోకరకొండ శ్రీదుర్గ, సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట నుంచి అచ్చంపేట వెళ్లే భారత్ మాల రోడ్డుకు బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా గడ్డర్లు లేపుతున్నందున సామర్లకోట నుంచి కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ఈనెల 7 నుంచి 10 వరకు ట్రాఫిక్ నిలుపుదల చేస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట జంక్షన్‌లో రోడ్డుపై గడ్డర్‌లు లేపుతున్నందున జూన్ 11 నుంచి 13 తేదీ వరకు మూడు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి పోలీసు అందించే మార్గదర్శకాలను పాటించి తమ వాహనాలను మళ్లించాలన్నారు.

నేరాల అదుపు కోసం డ్రోన్‌లతో నిఘా

ప్రజాశక్తి - జగ్గంపేట

నేరాలను అదుపు చేసేందుకు సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాట్రావుల పల్లిలో వారపు సంతలో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. గ్రామంలోని యువకులతో మాట్లాడి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. నేరాలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని సిఐ తెలిపారు.

అయినవిల్లి తహశీల్దార్‌పై హత్యాయత్నం

దాడికి గురైన తహశీల్దార్ నాగలక్ష్మమ్మ

దాడి చేసిన వ్యక్తి

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి తహశీల్దార్ సిహెచ్.నాగ లక్ష్మమ్మపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేసి హత్యయత్నానికి పాల్పడ్డాడు. అయినవిల్లి మండలం జోగిరాజు పాలెం కు చెందిన మీసాల సత్యనారాయణ శుక్రవారం మధ్యాహ్నం అయినవిల్లి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి విధి నిర్వహణలో ఉన్న తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ పై కత్తితో దాడికి పాల్పడగా సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారం అందించారు. దాడి చేసిన సత్యనారాయణను సిబ్బంది అడ్డుకోవడంతో తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. అయినవిల్లి ఎస్ఐ శ్రీహరికోటి శాస్త్రి ఘటన స్థలానికి చేరుకుని నిందితుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

దాడిని ఖండించిన సిపిఎం

అయినవిల్లి తహసీల్దార్ నాగలక్ష్మమ్మపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డంపై సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు సంబంధించి విచారణ జరిపి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందని ప్రభుత్వంపై ఉందన్నారు.

పునరావృతం కాకుండా చూడాలి

అయినవిల్లి తహశీల్దార్ సిహెచ్.నాగ లక్ష్మమ్మపై వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటనపై ఎపిఆర్ ఎస్ఎ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడవలసిందిగా కలెక్టరు, జెసిలను కోరుతూ ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని అయినవిల్లి డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్, చైర్మన్ ఎపిఆర్ఎస్ఎ, ఎపిజెఎసి జిల్లా శాఖ కోరారు.

తేజ కుటుంబ సభ్యులను అభినందిస్తున్న డిటిఒ శ్రీనివాసరావు

జెఇఇ ర్యాంకర్లకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

జెఇఇలో ర్యాంకర్లకు జిల్లా రవాణాశాఖ అధికారి అభినందనలు తెలిపారు. చెముడులంకకి చెందిన నాగిరెడ్డి శ్రీనివాసు, నాగ అరుణ దంపతుల కుమారుడు తేజ చంద్రనారాయణ జెఇఇ అడ్వాన్స్ పరీక్షా ఫలితాల్లో ఆల్ ఇండియా 172 వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 1911 వ ర్యాంకు సాధించాడు. అంతకు ముందు అమ్మాయి శ్రావణి జెఇఇ అడ్వాన్స్ ఫలితాలలో 1800 ర్యాంక్ సాధించింది. దీంతో శుక్రవారం జిల్లా రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు చెముడులంక ఆ సామాన్య రైతు ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పిల్లలతో సహా అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన వార్త చూసి విద్యార్థుల నైపుణ్యాన్ని అభినందించాలని వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలు గురించి మాట్లాడుతూ అమ్మాయి శ్రావణి జెఇఇ అడ్వాన్స్ ఫలితాలలో 1800 ర్యాంక్ సాధించి మద్రాస్ ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతుందన్నారు. అబ్బాయి తేజ జూన్ 2 న వెలువడిన దేశంలోనే జెఇఇ అడ్వాన్స్ పరీక్షా ఫలితాల్లో ఆల్ ఇండియా 172 వ ర్యాంకు సాధించగా ఓపెన్ కేటగిరీలో 1911వ ర్యాంకు వచ్చిందన్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదవాలని లక్ష్యంగా తేజ ఉన్నట్లు తెలిపారు. అభినందించిన వారిలో కూటమి నాయకులు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి వెంకటరత్నం, నాగిరెడ్డి బాలకష్ణ, రాయుడు వెంకటేష్, కొత్తపల్లి రాంబాబు, అడబాల వీర్రాజు, తదితరులు ఉన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ డి.అఖిల

యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 9న నిర్వహిస్తున్న యోగా గ్రాండ్ ఈవెంట్ కు సంబం ధించి ముందస్తు ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ బాధ్యతలు అప్పగించిన అధికారులు సంపూర్ణ మైన ఏర్పాట్లతో కార్యక్ర మాన్ని సఫలీకతం చేయాలని, సోమవారం ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు యోగా గురువులు యోగాభ్యాసనాలు చేస్తారని. ప్రతి ఒక్కరు యోగా ను ఆచరిస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ కళ్ళు దుర్గ భవాని, ఇన్‌ఛార్జి తహశీల్దార్ బి.మృత్యుం జయరావు, విద్యాశాఖ అధికారి నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

మూలస్థానం అగ్రహారంలో రోగి కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న జెపి

ప్రజాశక్తి - యంత్రాంగం

బాధిత కుటుంబాలకు పలువురు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు ఇవి..

ఆలమూరు: మండలంలోని మూలస్థానం అగ్రహారానికి చెందిన మట్టపర్తి రాంబాబు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన కుటుంబ సభ్యులకు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు ఏర్పాటుచేసిన రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని కూటమి నేతలు అందించారు. రాంబాబుకు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఖరీదైన వైద్యం అందించవలసి ఉంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాంబాబు కుటుంబానికి తన వంతు సహాయంగా బండారు శ్రీనివాస్ సమకూర్చి అందించే సాయాన్ని జనసేన నేత సలాది జయప్రకాష్ నారాయణ శుక్రవారం రోగి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు భావిశెట్టి తాతాజీ, కూటమి నాయకులు తోట నాగేశ్వరరావు, కోటిపల్లి శ్రీనివాస్, తోరాటి అర్జున్ రావు, గానుగుల చిన్న ఉప్పులూరి సత్తిపండు, వెంకటేష్, మురముల రాజు, ఉప్పులూరు విజయ దుర్గ, కౌలు కోటి పెద్ద, తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి:** మండలం మాగం ఒకటవ నెంబర్ కాలువగట్టుకు చెందిన డ్రైవర్ సవరపు దుర్గారావు ఇటీవల అనారోగ్యం కారణంగా అమలాపురం కిమ్స్ హాస్పిటల్‌లో సర్జరీ చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నార. అతనిని శుక్రవారం అమలాపురం రథసారథి యూనియన్ ప్రెసిడెంట్ వాసంశెట్టి సత్యానందం ఆధ్వర్యంలో కమిటి పెద్దలు కలిసి పరామర్శించి యూనియన్ సభ్యుల ద్వారా సేకరించిన రూ.7500 అందజేశారు. ఈ సందర్భంగా అడిగిన వెంటనే ముందుకు వచ్చి సహాయం చేసిన డ్రైవర్స్ అందరికీ, ప్రతి విషయంలో తోడుగా నిలుస్తున్న యూనియన్ సభ్యులకు ప్రెసిడెంట్ సత్యానందం కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దంగేటి దుర్గా ప్రసాద్, సెక్రెటరీ మంద దుర్గారావు, ట్రెజర్ యర్రా నరసింహ స్వామి, మెంబెర్స్ పాల్గొన్నారు.

సాయం చేస్తున్న రథసారథి యూనియన్

IN THE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT KAKINADA
EP.No.116/2023 in O.S.No.97/2020

Between:
Gubbala Satyanarayana ...DHR/Plaintiff
and
Tekumudi Suryabhaskara Rao ...JDR/Defendant

To.
Tekumudi Surya Bhaskara Rao, S/o.Kamaraju, R/o. D.No.4-392/18, Zilla parishad High School, New Gaigolupadu Kakinada.

పై నెంబరు అమలు గ్రందములో JDR అయిన మీకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపినను మీరు తీసు కొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు హాజరు నిమిత్తం **ది.23-06-2025** సం॥తేదికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

SK.AMEER JANI
Advocate,
Jagannadhapuram,Kakinada
Cell 9642406830